క్లుప్తంగా

ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకుంది. స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం తదితర పూజ అనంతరం ఫలపుష్పాలతో ఆలంకరించారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



మార్తమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కోసిగి: మండలంలోని దొడ్డి గ్రామానికి చెందిన మార్తమ్మ అనే వృద్ధురాలు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కర్నూలులోని అమీలియో హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ వీరేష్ అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు.

బారికేడ్లు అందజేత



గురురెడ్డిని సన్మానిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఆదోని టౌన్ : పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణ కోసం పారిశ్రామికవేత్త గురురెడ్డి సోమవారం బారికేడ్లు అందజేశారు. దీంతో ట్రాఫిక్ సీఐ పార్థసారథి, ఎస్‌ఐ సతీష్‌కుమార్ గురురెడ్డిని సన్మానించారు.ఎనిమిది బారికేడ్ల విలువ దాదాపు రూ.1.50లక్షలు ఉంటుందన్నారు. ప్రధాన సర్కిళ్లు, కూడళ్లు, వన్‌వేల వద్ద బారికేడ్లను ఉపయోగిస్తామని సీఐ తెలిపారు. మధు హాస్పిటల్ మేనేజర్ గోవింద్, ఏఎస్‌ఐ లక్ష్మన్న, రైటర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలకు రీ సర్వే



జేసీబీతో రోడ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని నౌలేకల్లు గ్రామంలో 2004లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సర్పంచ్ పల్లవి నరేష్ సోమవారం రీ సర్వే చేయించారు. ఆమె మాట్లాడుతూ నాడు పట్టాలు ఇప్పించినా స్థలాలు ఎక్కడున్నాయో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వారు తనను సంప్రదించడంతో సమస్యను మండల నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రీ సర్వే చేయించాలని ఆయన సూచించారన్నారు. సర్వే అనంతరం కాలనీకి డాక్టర్ వేణుగోపాల్ కాలనీగా ప్రజలు నామకరణం చేసుకున్నారని చెప్పారు.

అక్రమ రేషన్ తరలింపును అరికట్టాలి

మంత్రాలయం రూరల్: మండలంలో కొందరు అక్రమ రేషన్ బియ్యం వ్యాపారాన్ని ఉపాధిగా మార్చుకున్నారని వారి చర్యలను అరికట్టాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వీరేష్, సీపీఎం మండల అధ్యక్షుడు జయరాజు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు అందించే బియ్యాన్ని డీలర్లు, కొందరు అక్రమ వ్యాపారులు ప్రజల నుంచి కొనుగోలు చేసి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వాటిని నియంత్రించి పేదలకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆ సర్టిఫికెట్లను ఇవ్వొద్దు

ఆదోని రూరల్ : కొన్ని కులాలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయకుండా చర్యలు తీసుకవోఆలని సోమవారం ఎస్సీ, ఎస్టీ, వివిధ దళిత సంఘాలు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బాలస్వామి, కేవీపీఎస్ విజయ్, మాలమహానాడు సంఘం నాయకుడు సాయిరాం మాట్లాడూత వెనకబడినవర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఎస్సీ కుల రిజర్వేషన్ పత్రాలను ఇచ్చేలా చేశారన్నారు. అయితే ఆర్థికంగా స్థిరపడిన కొన్ని కులాలకు ఎస్సీ సర్టిఫికెట్లు అందజేయడం తగదన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆర్థిక సాయం

ఆదోని రూరల్ : పెద్దహరివాణం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని నిర్మలకు తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఎస్‌ఐ విజయలక్ష్మి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థినికి ఆస్పరిలోని కస్తూర్బాలో బైపీసీ సీటు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారని చెప్పారు.



ఈ ఫొటోలో ధ్రువ పత్రం చూపుతున్న వృద్ధురాలి పేరు రాణమ్మ. కోసిగి మండలంలోని దొడ్డి గ్రామం. ఈమె మనువడు జగన్ ఆలూరులోని హాస్టల్ ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. '' హాస్టల్‌లో చేరేందుకు కుల ధ్రువీకరణ పత్రం కావాలని వార్డెన్ సూచించడంతో మాకు సమాచారమిచ్చాడు. మేము వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాం. సర్టిఫికెట్ రావడానికి చాలా రోజులు సమయం పడుతుందని, పలుమార్లు తిరగాల్సి వస్తుందని, తాము అలాగే ఇబ్బందులు పడ్డామని చెప్పడంతో నాలో ఆందోళన మొదలైంది. అయితే రెండు రోజుల్లోనే ధ్రువపత్రంతో వలంటీర్ ఇంటికొచ్చి అందజేశాడు. చాలా సంతోషంగా ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పైసా ఖర్చు కాకుండా సర్టిఫికెట్ అందజేశార''ని పేర్కొంది.



ఇక్కడ రేషన్ కార్డు చూపుతున్న ఈమె పేరు సునీతమ్మ. కోసిగి మండలంలోని దొడ్డి గ్రామస్తురాలు. ఇటీవల తన కుమారుడు దేవమణికి కౌతాళం గ్రామానికి చెందిన వెన్నెలతో వివాహం జరిపించారు. తమ రేషన్ కార్డులో కోడలి పేరు నమోదు చేయించాలని వలంటీర్ దృష్టికి తీసుకెళ్లాం. జగనన్న సురక్ష కార్యక్రమం కింద మా కార్డులోకి కోడలి పేరును ఎంట్రీ చేయించారు. గతంలో మాఇంటి పక్కనున్న వారి పేరు ఎంట్రీ చేయడానికి దాదాపు రెండు మూడు నెలలు పట్టింది. వారి ఇబ్బందులు తెలుసుకొని, తాము కూడా ఇలా అవస్థలు పడాల్సి వస్తుందేమోననకున్నాం. అయితే ఒక్క రోజులోనే మాకు కార్డు కూడా ప్రింట్ తీసివ్వడం సంతోషకరం.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



సాయిబాబాకు హారతులిస్తున్న దృశ్యం



ఆదోనిలోని టీజీఎల్ కాలనీ,



కోసిగిలో పూజలకు హాజరైన భక్తులు

మంత్రాలయం: 52 బసాపురం గ్రామంలో సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా తెల్లవారుజాము నుంచి సాయిబాబాకు ఫల, పుష్ప, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వై.సీతారామిరెడ్డి, వై.బాలనాగిరెడ్డి, వై.ప్రదీప్‌రెడ్డి, వై.ధరణీరెడ్డి సాయి బాబాకు ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు జి.భీమిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాబిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, పెట్రోల్ బంక్ శీనన్న తదితరులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కోసిగి: స్థానిక ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మందిరంలో సాయి ఋత్విక్ రమేష్, సాయిసేవక్ పాండురంగల ఆధ్వర్యంలో బాబా వారికి వేకువజామున కాగడ హారతి, సుప్రభాతం, అభిషేకం, ఉచిత సాయి సామూహిక సత్యవ్రతాలు, విరాట్ సాయిసోత్రం నిర్వహించారు. మధ్యాహ్నం హారతి, బాబా చిత్ర పటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.





కోసిగి ఆదోని టీజీఎల్ కాలనీలో విశేష అలంకరణలో సాయిబాబా

ఆదోని అర్బన్ : పట్టణంలోని సాయిబాబా మందిరాల్లో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీజీఎల్ కాలనీలోని సాయిబాబా మందిరంలో బాబాకు ఉదయం నుంచి భక్తులు పాలాభిషేకం చేపట్టారు. మధ్యాహ్న హారతి, అన్నదాన కార్యక్రమాలు జరిపించారు. సాయంత్రం హారతి ఇచ్చిన అనంతరం భక్తులు బాబాను దర్శించుకున్నారు. రాత్రి శేజ్ హారతితో ఉత్సవాలు పూర్తయ్యాయి. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డీవీవీ ప్రసాద్, సెక్రటరీ టీజీ రాంప్రసాద్, వీరస్వామి, షిర్డీ సాయిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సాదాపురం, పెద్దహరివాణం, పెద్దతుంబళం, మదిరె, దొడ్డనగేరి తదితర గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. సాదాపురంలో అచ్యుతానందస్వామి చిత్రపటాన్ని ఊరేగించారు.

పెద్దకడబూరు : గురుపౌర్ణమిని పురస్కరించుకొని స్థానిక సాయిబాబా ఆలయంలో సోమవారం వేడుకలు జరుపుకున్నారు. సాయిసేవక్ ఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం బాబాకు కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకం, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతములు చేపట్టారు. మధ్యాహ్నం బాబావారి ఉత్సవమూర్తిని ఊరేగిం చారు. సాయంత్రం నుంచి 4వ తేదీ ఉదయం వరకు అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించనున్నారు.

మంత్రాలయం రూరల్: మండలంలోని చెట్నేహళ్లి గ్రామంలో తిక్కతాత స్వామికి గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, అలంకరణ, మంగళహారతి చేపట్టారు.

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు, ఏరిగేరి, కామవరం గ్రామాలతో పాటు రాజానగర్ క్యాంపులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ఆయా ఆలయాల్లో అన్నదానం చేశారు.



ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



కలశాలతో చిన్నారులు,
వివిధ వేషధారణలో భక్తులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోసిగి: జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని పకడ్బందీగా, మెనూ ప్రకారం అందించాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. సోమవారం మండలంలోని ఆర్లబండ గ్రామ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ ఆధారంగా భోజనం వడ్డించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఏఐఎస్ఎఫ్ తాలుకా కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ మెనూ పాటించడం లేదని చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. సీఆర్‌పీ యోహాన్, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆదోని సెంట్రల్: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఎమ్మిగనూరు సర్కిల్‌లో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించినా ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించలేదన్నారు. రాష్ట్రంలో ఖాళీగానున్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రతి విద్యార్థికి నిరుద్యోగభృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహేష్, పవన్, సునిల్, వీరేష్, నందా పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

ఆదోని రూరల్ : ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని విరుపాపురం, 104బసాపురం, మదిరె హానవాలు తదితర గ్రామాల్లో రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నరసప్ప, యల్లప్ప ఆధ్వర్యంలో సచివాలయాల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని విత్తనాలు, ఎరువులను, యంత్రాలను 90 శాతం రాయితీతో ఇవ్వాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. నాయకులు రామప్ప, మల్లికార్జున, గుడిసె ఈరన్న, భీమప్ప పాల్గొన్నారు.

ఇరువర్గాల బైండోవర్

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో సర్వే నెంబరు 251లో 34.5 సెంట్ల స్థలానికి సంబంధించిన వివాదంలో ఇరువర్గాలను బైండోవర్ చేసినట్లు మాధవరం ఎస్‌ఐ కిరణ్‌బాబు సోమవారం తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు చెట్నేపల్లి గ్రామానికి చెందిన చాకలి రామదాసు, మాధవరం గ్రామానికి చెందిన బంగి నాగప్ప, భీమరాయుడు, మరోవర్గం మాధవరం గ్రామానికి చెందిన బోయ మలబద్ధి నరసింహులు, రాంపురానికి చెందిన మహ్మద్ అలీపై ముందుస్తుగా కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

స్పందన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఇందులో ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయరాదని, అర్జీదారులను సంతృప్తపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు.సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గోవిందసింగ్, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మినారాయణ, ఎస్సీ వెల్ఫేర్ సుధాకర్, మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ మేనేజర్ విజయ్‌బాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్జీల ద్వారా వచ్చిన సమస్యల్లో కొన్ని..

- నందవరం మండలం నాగులదిన్నె గ్రామానికి చెందిన జయలక్ష్మికి సంబంధించి సర్వే నం. 146/1లో 2 ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం ఆ పొలం సర్వే నంబర్‌ను డిస్ప్యూట్‌లో నమోదు చేశారు. సర్వే నంబర్ డిస్ప్యూట్‌ను తొలగించాలని అర్జీ సమర్పించింది.
- జగనన్న కాలనీలో అటవీశాఖ వారితో మొక్కలు నాటించాలని ఆదోని పట్టణంలోని సాయి బాబానగర్‌కి చెందిన సయ్యద్‌నసురుద్దీన్ పటేల్ వినతి పత్రం అందజేశారు.
- ఆదోని పట్టణంలోని క్రాంతినగర్ ఆంజనేయ స్వామి దేవాలయం వద్దనున్న కాలనీలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు అర్జీలో కోరారు.
- నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన భాస్కర్‌కు సర్వే నంబర్ 93ఏ1లో 2 ఎకరాల భూమి ఉంది. ప్రస్తుతం ఆ భూమి ఎమ్మిగనూరు సివిల్‌కోర్టులో ఉందని, ఆ సర్వే నంబర్‌ను డిస్ప్యూట్‌లో నమోదు చేయాలని అర్జీ అందజేశారు.



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

సమస్యల పట్ల నిర్లక్ష్యం వద్దు

ఆదోని టౌన్ : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అధికారలకు సూచించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వేళకు నీటిని విడుదల చేయడంలేదని, శివారు ప్రాంతాల్లో వీధిలైట్లు లేక అంధకారంలో ఉండిపోతున్నామని పలు సమస్యలపై ఆరుగురు అర్జీలు అందజేశారు. వాటిపై విచారించి తక్షణమే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ భరోసా ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మెప్మా ప్రాజెక్టు అధికారి వీరారెడ్డి, డీఈ నాయక్, టీపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

ఆదోని టౌన్ : వర్షాభావ పరిస్థితుల కారణంగా పట్టణానికి తాగునీటిని అందించే బసాపురం ఎస్ఎస్ ట్యాంకులో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. నీటి నిల్వలు తక్కువగా ఉండడంతో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం మూడు రోజులకొకసారి తాగునీరు సరఫరా అవుతోందని, అయితే వర్షాభావ పరిస్థితుల కారణంగా నాలుగు రోజులకొకసారి సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసేవని, దీంతో నీటి ఇక్కట్లు ఉండేవి కాదన్నారు. ఈ ఏడాది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు కురవకపోవడంతో నీటి సమస్య జఠిలమైందన్నారు. వైస్ చైర్మన్లు నరసింహులు, అబ్దుల్‌గౌస్, కౌన్సిలర్ చలపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత, వైస్ చైర్మన్లు

ఇళ్ల స్థలాలు చూపండి

మంత్రాలయం రూరల్: మండలంలోని చౌలహళ్లి గ్రామంలో సర్వే నెంబరు 19/బీ1 ఏ అండ్ బీ2 లోని 2.89 ఎకరాల్లో 77 మంది దళితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జైభీమ్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 1999లో 77 మందికి తమకు పట్టాలు ఇచ్చారని, ఇందుకు హరిజన గోషన్నకు చెందిన భూమి సర్వే నంబరు 19/బీ1 ఏ అండ్ బీ2 లోని 2.89 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందని చెప్పారు. అయితే లబ్ధిదారులంతా 2015లో ఇళ్లు నిర్మించుకోవాడానికి వెళ్లగా గోషన్న కుమారుడు నరసప్ప, కోడలు ముత్తమ్మ అడ్డుకోవడమే కాకుండా వారు అప్పటి రెవెన్యూ అధికారులపై హైకోర్టులో రిట్ వేశారన్నారు. కాగా..ప్రొసిజర్ ప్రకారం వెళ్లాలని నాడు కోర్టు ఆదేశాలు జారిచేసిందన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇళ్ల స్థలాలు చూపి హద్దురాళ్లు పాతించాలని కోరారు. శివ, ఏసు, నగేష్, జోజి, దేవదాసు, పొలయ్య, జోసెఫ్ పాల్గొన్నారు.

రేపు పాఠశాలల బంద్

ఆదోని సెంట్రల్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రించాలని ఈనెల 5వ తేదీన పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామాక్షి వెంకట్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బంద్ నిర్వహిస్తున్నామని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఫీజులు వసూలు చేయడం, పుస్తకాలు, యూనిఫాంలను అధిక ధరలకు విక్రయించడం సరికాదన్నారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు, ప్రజలు బంద్‌కు సహకరించాలని కోరారు.

కోసిగి: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో జరుగుతున్న ఫీజులు, పుస్తకాల పేరుతో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యా సంస్థలు బంద్ చేయిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు విజయ భాస్కర్, టౌన్ కన్వీనర్ వెంకటేష్ తెలిపారు. సోమవారం వారు కోసిగిలో విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 5న మండలంలోని విద్యాసంస్థల బంద్‌కు సహకరించాలని కోరారు.

పొలం రస్తా విషయంలో దాడి

- ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న ముత్తురెడ్డి

కోసిగి: మండలంలోని పల్లెపాడు గ్రామానికి చెందిన దేవరెడ్డి లక్ష్మన్న, ఆయన కుమారుడు ముత్తురెడ్డి, కోడలు తాయమ్మపై అదే గ్రామానికి చెందిన కొరవయ్య లక్ష్మీరెడ్డి, ముక్కన్న, యలప్ప, శంకరమ్మ కలిసి దాడి చేసి గాయపరిచారు. ఆదివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని లక్ష్మన్న కుటుంబ సభ్యులు ఎద్దుల బండిపై ఇంటికొస్తుండగా తమ పొలంలో బండి ఎలా తోలుకెళ్తారంటూ కొరవయ్య కుటుంబ సభ్యులు కర్రలతో దాడి చేశారు. దాడిలో ముత్తురెడ్డి తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. లక్ష్మన్న, తాయమ్మ గాయపడ్డారు. వీరిని పల్లెపాడు గ్రామం నుంచి అంబులెన్స్‌లో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాదాపు 40 ఏళ్లకు పైగా అదే రస్తాలో రాకపోకలు సాగిస్తున్నామని, తమపై కక్ష కట్టి దాడులకు పాల్పడ్డారని బాధితులు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

స్తంభాలు ఏర్పాటు చేయాలి

ఆదోని టౌన్ : పట్టణంలోని ఇంజినీరింగ్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు సోమవారం ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్తంభాలు లేకపోవడంతో వీధిలైట్లు లేక చీకట్లో ఉంటున్నామని, స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రిటైర్డ్ ఎస్‌ఐ ఎస్.బాషా, కాలనీవాసులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. కాలనీలో ఎన్ని విద్యుత్ స్తంభాలు అవసరమవుతాయో తెలుసుకుని, వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



ఎమ్మెల్యే సాయిని సన్మానిస్తున్న కాలనీవాసులు

రోడ్డు ప్రమాదంలో రెండు జింకలు మృతి

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం బైచిగేరి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు జింకలు మృతి చెందినటు ఫారెసు రేంజ్ అధికారి రామచంద్రుడు సోమవారం విలేకరులకు తెలిపారు. ఆదోని నుంచి ఎమ్మిగనూరుకు వెళ్లే రహదారిలో బైచిగేరి దగ్గర జింకలు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అవి మృతి చెందాయి. ఫారెస్టు సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని జింకలను స్వాధీనం చేసుకున్నారు.

కంటి ఆపరేషన్ కోసం కర్నూల్‌కు

కౌతాళం: మండలంలోని కరణి గ్రామానికి చెందిన 25 మంది కంటి ఆపరేషన్ కోసం కర్నూల్‌లోని అమీలియా ఆసుపత్రికి తరలివెళ్లారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఇటీవల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆపరేషన్లు ఆవసరమైన వారిని సోమవారం కర్నూల్‌కు తరలించామని సర్పంచ్ పుష్పలత, నాయకులు గోవిందులు, వైద్యులు సింహం వీరన్న తెలిపారు.

23న బాడీ బిల్డర్ పోటీలు

ఆదోని అర్బన్ : ఈనెల 23వ తేదీన స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆవరణలోని ఆడిటోరియంలో మిస్టర్ కర్నూలు జిల్లా బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాలులో శ్రీ హనుమాన్ వ్యాయామశాల జాపల్లి బాడీలైన్ జిమ్ సభ్యులు కునిగిరి నీలకంఠ, చైర్మన్, సెక్రటరీ హనుమంతు, జాయింట్ సెక్రటరీ సాకారే శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్ ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు.

ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

కౌతాళం: గ్రామంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ తెలిపారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో సర్పంచ్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం, ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధుల నుంచి చేపడుతున్న పనుల గురించి వివరించారు. వర్షకాలం ప్రారంభం కావడంతో డెంగీ, చికెన్ గున్యా, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చూస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, అబ్దుల్‌సమద్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పీఠాధిపతికి గురువందనం



వేడుకల్లో పాల్గొన్న దాససాహిత్య సభ్యులు



పీఠాధిపతికి పుష్పాలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురుపౌర్ణమి సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులకు గురువందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ పగడాల ఆనంద తీర్థచార్య ఆధ్వర్యంలో పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులకు శ్రీ వారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం కప్పి పుష్పాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వీరికి పీఠాధిపతి శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలిచ్చి ఆశీర్వదించారు.. దాదాపు 3,500 మంది దాససాహిత్య ట్రస్టు సభ్యులు శ్రీ మఠంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. దీనికి తోడు గురుపౌర్ణమి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శ్రీ మఠం పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి.

జిల్లా సమగ్రాభివృద్ధికే పాదయాత్ర

ఆదోని రూరల్ : కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.ఎస్.రాధాకృష్ణ తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో పట్టణ కమిటీ సమావేశం ముక్కన్న అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లా పశ్చిమ ప్రాంత అభివృద్ధికి తాగు, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కమిటీ నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, వెంకటేష్, మునెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.